# దండుగ

అదో పల్లెటూరు.... ఆ ఊరిలో భారతదేశం పటం కింద విసిరి వేసినట్టున్న శ్రీలంకలాంటి దళితవాడ. వీధంతా నిర్మానుష్యం గా వుంది. అంబలి కంచం ముందు కోకోకోలా బాటిల్‌లాగ ఓ పూరి గుడిసె ముందు నుంచున్న పి. కుమార్. ఐ.ఆర్.ఎస్.

గుడిసెలోపల గరుడయ్య శవం.

గుండెలు బాదుకుంటూ ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిన అతని భార్య మైసమ్మ, కూతురు కమల, ప్రక్కన బిక్కు బిక్కుమంటూ కూర్చున్న పి.కుమార్ భార్య వందన, వాళ్ళ అమ్మాయి, అబ్బాయి.

గరుడయ్య మరణించి గంటపైనే అయినా, అంత్యక్రియలకు సహకరించని కుల బంధువులు. పి.కుమార్ అలియాస్ పోతకుమార్ అలియాస్ పోతరాజు అంతర్మధనం...

అవును వారెందుకు తనకు సహకరించాలి? తానన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి. 'నేనెంత పెద్ద ఆఫీసర్‌నో మీకేమన్నా తెలుసా? నేనొక్క బటనొత్తితే మీ అసుంటోల్లు నలుగురు చేతులు కట్టుకుని నిలబడుతారు, మీ ఊరు ఆయిన, మంచి కొలువు జేత్తున్నాడని మీకెంత గర్వముండాలె? నాకెంత మాన్ (మన్నన) ఇవ్వాలి? నన్ను చిన్నప్పటి పోతగాణ్ణి చూసినట్లు చూస్తే ఎట్ల? కులపెద్ద నుద్దేశించి తానన్న మాటలు.

"అవు బిడ్డా! నువ్వు పెద్ద ఆఫీసర్‌వే గాని ఆ ఆఫీసరువు ఎట్లయినవో నీకేమన్నా యాదున్నదా. మనిషికింతని చందలు జమచేసి నిన్ను, పెద్దపెద్ద సదులకు పంపితే, నువు మన ఊరోల్లకు సేసిన ఉపకారం ఏంది? ఉపకారం ఎనకసిరి, పట్నంల మీ ఇంటికత్తే నువ్వు నీ పెండ్లం హీనహీనంగా మాట్లాడి ఎల్లగొడ్తిరి. చాయినీల్లు కాదుగదా, ఉత్తనీల్లు గూడా ఇయ్యక పోతిరి. మేట్రిక్ పాసయిన మన పోరగాండ్లు కాలేజీల ఏం జదాల? మన కులపోల్లకు గౌర్మెంటు ఏమేం సౌలత్‌లు ఇస్తది? ఈ సంగతులు ఎప్పుడన్న మన పోరగాండ్లకు సెప్పినవా. ఏ నౌకిరిలు కాలీగ ఉన్నయి? ఆ పరీచ్చలు పాసయెతందుకు ఏ పుస్తకాలు సదాల? ఈ మతులబు మన పిల్లలకు సముజాయించినవా? మేం యాడికి పోయినా, మా ఊరి పిల్లగాడు మమ్మయిల (ముంబయిలో) పెద్ద గౌర్మెంటు కొలువు జేత్తున్నడని జెప్పుకుంటం. నువ్వైతే మీ తల్లిదండ్రులను గూడా పని మనుషలకంటే హీనంగా జూత్తివి. మీరు పిలిత్తేనే ఆల్లు మీ ఇంటికత్తే, మీ ఇంట్ల పని మనుసులని మందికి జెప్తిరి, అప్పటి నుంచి ఆల్లు మీ ఇంటికచ్చుడు బందు జేసిరి. ఆల్ల కడుపు కాల్సుకొని నీకు మంచి తిండి వెట్టి, బాగ సదిపిత్తే గట్లనేనా నువు ఆల్లను సూసేడిది. నీ లగ్గం ఎట్లయిందో మాకు తెల్వకపాయ, నీ పిల్లల బార్స (బారసాల) ఎట్లయిందో మాకు ఎర్కలేకపాయె ఇంక నువ్వు మాతోని ఏం సంబంధం పెట్టుకున్నట్టు?" కులపెద్ద మాటలు చెవిలో గింగురమంటున్నాయి. పశ్చాత్తాపం మనసును దహింపజేస్తుంది. కాని? ఇప్పుడు కార్యం గట్టునపడేదెట్లా? చప్పున భీమయ్య జ్ఞప్తికి వచ్చాడు. ఈ ఊరి స్కూల్లో తన క్లాస్‌మెట్. ఇప్పుడతను ఇదే ఊళ్ళో టీచరుగా చేస్తున్నాడు. అతనైతే తనను అర్థం చేసుకుంటాడు. కులం వారిని ఒప్పించమని అతన్ని కోరాలి. అలా అనుకుని, భీమయ్య ఇంటివైపు భారంగా అడుగులు వేశాడు కుమార్.

"రండి రండి" భీమయ్య ఆహ్వానించాడు కాని అది మనస్ఫూర్తిగా అన్నట్టు లేదు.

"అదేంటీ భీమా! ఏదో పరాయివాణ్ణి పలకరించినట్లుగా ఆ మన్నన? నేనెప్పుడూ నీ రాజునే."

"అది మన చిన్నప్పటి మాట. ఇప్పుడు మీరు ఓ పెద్ద కేంద్ర ప్రభుత్వ అధికారి, నేనేమో బతకలేని బడిపంతుల్ని."

"అలా నిన్ను నువ్వు చిన్న చేసుకుని, నన్ను మన్నించి మాట్లాడి నన్ను దూరం కొట్టకు, ఎప్పటిలాగే ఏరా రాజు! అని పిలువ్."

భీమయ్యకు రెండేళ్ళ కిందటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది. పోతరాజు ఊళ్లోకి వచ్చాడని తెలిసి వాళ్ళింటికి వెళ్ళి 'బావున్నావా రాజూ !' అని పలకరిస్తే అతను ముభావంగా ఉన్నవైనం గుర్తొచ్చింది, అంతేకాదు తను ఊళ్ళో అడుగుపెట్టిన్నుంచి

అందరూ పూర్వపు పోతరాజు గానే అనుకోవడం గురించి నిరసనగా మాట్లాడాడు. వీళ్ళకి తను ఎంతో పెద్ద ఆఫీసరో అస్సలు ఇంగితం లేదని తూలనాడాడు. అయినా అవమానం మింగి, తమ కొత్త ఇల్లు చూడడానికి రమ్మని ఆహ్వానిస్తే, చూస్తాను అని దాటవేశాడు. ఇప్పుడు వచ్చి? "నేను మునుపటి రాజునే" అని ఆప్యాయత ఒలక బోస్తున్నాడు. రాజు ఎందుకు వచ్చాడో తెలుసుకోలేని అమాయకుడేం కాదతను, అయినా అతని నోటి నుండే వినాలి అని గమ్మున ఉన్నాడు భీమయ్య.

ఇటు కుమార్, భీమయ్య ఇల్లును గమనించసాగాడు. ఇల్లు చిన్నదైనా కుదురుగా ఉంది. అన్ని వస్తువులు పొందికగా అమర్చారు. చూపు మళ్ళీ భీమయ్యవైపు మళ్ళింది.

"ఏంటి భీమా ఆ పరధ్యానం? నీకు ఈ పాటికి సంగతి తెలిసే ఉంటుంది గదా? నువ్వే నాకిప్పుడు సహాయం చేయాలి" విషయంలోకి వచ్చాడు కుమార్.

"తెలుసుకాని, దాంట్లో నేనేం చేయగలను?" కులకట్టడి జవదాటలేనుగదా? పరిస్థితి ఇంతదాకా ఎందుకు వచ్చిందో నాకంటే నీకే బాగా తెలుసు" భీమయ్య చేతులెత్తేశాడు.

"అలా అనకు భీమా" నీ మీద ఎన్నో ఆశలు పెట్టుకునివచ్చాను. ఊళ్ళోని మన కులం వాళ్ళలో నువ్వే బాగా చదువుకున్నవాడివి. నాకు సన్నిహితుడివి. గౌరవప్రదమైన ఉద్యోగంలో ఉన్నావు. మన కులపెద్దకు నీ మాట మీద గురి ఉన్న సంగతి ఎవరూ కాదనలేని సత్యం. దయచేసి నన్ను ఈ ఆపదనుండి గట్టెక్కించు. నా తప్పుకు ఏ ప్రాయశ్చిత్తం చేయమన్నా చేస్తాను." పోతకుమార్ స్వరంలో నిజాయితీతో కూడిన కంపన, భీమయ్య చలించాడు. ఇక ఎక్కువ సాగదీయడం భావ్యంకాదనుకున్నాడు. బట్టలు వేసుకుని కులపెద్ద ఇంటికి దారి తీశాడు. కుమార్ అనుసరించాడు.

కులపెద్ద ఆశన్న ఇంట్లో ఇంకా కొంతమంది ఊరిపెద్దలు కూర్చున్నారు. వారి ముఖాలు గంభీరంగా ఉన్నాయి.

ఇంట్లోకి అడుగుపెట్టగానే ఆశన్న కాళ్ళమీద పడ్డాడు కుమార్. తన కంటినీరుతో అతని పాదాభిషేకం చేశాడు. వెక్కివెక్కి ఏడుస్తున్న అతన్ని లేపి తన గుండెలకు హత్తుకుని, ప్రక్కన మంచంపై కూర్చోబెట్టాడు ఆశన్న.

"గరుడయ్య గురించే మాట్లాడుకుంటున్నం. నువ్వు పెద్ద నౌకిరికెక్కి మమ్ములను యాది మర్సినా గరుడయ్య సచ్చేదాక మాతోనే ఉన్నాడు, మాలోనే ఉంటడు. ఇప్పుడు జెప్పు నువ్వేమంటవు?"

"నేనేమనాల? అన్నీమీకే తెలుసు నా తప్పు ఒప్పు కుంటున్నాను. దానికి మీరేం శిక్షవేసినా నాకు సమ్మతమే కాని ఈ కార్యం కానీయండి ఇప్పటికే చాలా ఆలస్యం అయింది."

"సరే అదే మాట మీద నిలబడు గట్టెక్కినంక తెప్పకాల వెట్టినట్టు జేత్తే ఊకుండం. నీ మాటలకు ఊల్లంతా గవాయిలు (సాక్షులు) బాగా ఆలోసన జేసి చెప్పు, పోలీసోల్లకు శికాయతు జేసేదుంటే అదిప్పుడే సెయ్యి. మల్ల కిరికిరి వెడితే మంచిగుండదు" ఖరాకండిగా అన్నాడు ఆశన్న.

"ఇంకా నన్ను ఎందుకు సావగొడ్తరు పెద్దయ్యా? ఇప్పటి నుంచి మీమాట దాటుతే నన్ను మీ చెప్పుతో కొట్టండి. ఇక నుంచి నన్ను మీలో ఒకణ్ణిగానే చూడండి. ఆఫీసులో నేను పెద్ద ఆఫీసర్నేగాని, మన ఊర్లో మీలో ఒక మనిషినే "పోతకుమార్ 'శరణం మమ' పలికాడు.

కులం వారందరు కలిసి, ఆశన్న నేతృత్వంలో గరుడయ్య అంత్య క్రియలు ఘనంగా చేశారు. డప్పులకు తోడు బ్యాండు మేళం కూడా ఏర్పాటు చేశారు. దళిత వాడలోని వారేకాక ఇతర కులస్తులు కూడా పాల్గొన్న గరుడయ్య శవయాత్ర ఏ ఉన్నత కులస్తుల అంతిమ యాత్రకు తీసిపోలేదు. కుమార్ ఖర్చుకు వెనకాడకుండా ఆనవాయితీ ప్రకారం అన్ని విధులూ పూర్తి చేశాడు. తండ్రి మరణానంతర సంఘటనలు, కుమార్‌లో చాలా మార్పు తీసుకొచ్చాయి. మైసమ్మను ప్రాణపదంగా చూసుకుంటున్నాడు. డ్యూటీలో చేరింతర్వాత మళ్ళీ వెస్తులుబాటు ఉండదని నెలరోజులు సెలవు పెట్టాడు. ఇన్నేళ్ళ ఎడబాటుకు పరిహారంగా తనవాళ్ళతో తనివిదీరా గడపాలని నిశ్చయించుకున్నాడు. ఓ రోజు సాయంత్రం భీమయ్యతో కలిసి చెరువు కట్టకు పోయాడు కుమార్. ఇద్దరు మిత్రులు తమ గత జీవిత విశేషాలను నెమరు వేసుకున్నారు. స్కూలు ఫైనల్‌కాగానే ఇద్దరిదార్లు వేరయ్యాయి. స్కూలు ఫస్టొచ్చిన కుమార్, స్కాలర్‌షిప్‌పై జిల్లా కేంద్రంలోని ఇంగ్లీషు మీడియం కాలేజీలో సీటు సంపాదించాడు. భీమయ్యను కాలేజిలో చేర్చడానికి ససేమిరా అన్నాడు అతని తండ్రి. ఊళ్ళో ఉంటే తనకు చేదోడు వాదోడుగా ఉంటాడని అతని ఆశ. గరుడయ్య ఆలోచనలు వేరుగా ఉండేవి, ఇంట్లో ఎన్ని ఇబ్బందులు ఉన్నా తన కొడుకును ఉన్నత చదువులకు పంపాలి. ఆ తర్వాత అతను ఆఫీసరు ఉద్యోగం చేయాలి అని కలలు కనేవాడు. అతని కలలు నిజం అయ్యాయి, కాని తన కొడుకు ప్రవర్తన వల్ల ఆ ఆనందం మనసుకందకుండా పోయింది. అదే చెప్పాడు భీమయ్య కుమార్‌తో.

"నిజమే భీమా! నా మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న మా అమ్మా నాన్నలను చాలా ఘోరంగా వంచించానే కాని నా ఇబ్బందులునావి. స్వతహాగా మంచి మనసున్న వందనతో నా ప్రేమ చిగురించింది. ఆమె ఇచ్చిన నైతిక బలమే నన్ను ముందుకు నడిపించింది. ఐ.ఎ.ఎస్.కు కూర్చునే బలం చేకూర్చింది. ఒకసారి ఫెయిలయి,

నిరాశకులోనైన నాకు, ధైర్యం నూరిపోసి మళ్ళీ పోటీ పరీక్షకు కూర్చునేలా చేసింది వందన. ఇంటిలోని పరిస్థితుల ప్రాబల్యం వల్ల దళిత కులానికి చెందడం వల్ల, ఇన్ఫిరియారిటీ కాంప్లెక్స్‌తో కుంచించుకుపోయిన నన్ను తన ధైర్యవచనాలతో సాంతన వాక్యాలతో వికసింపజేసింది. నా ఈ విజయానికి పరోక్షంగా వందన ప్రోత్సాహమే కారణం. కుమార్‌లో ఉద్వేగం.

"నువ్వు చెప్పినట్టు తనది అంత మంచి మనసైతే మనవాళ్ళని చులకన చేసి మాట్లాడడమేంటి?"

"దానికి కారణం అప్పుడు హైకోర్టు, జడ్జిగా ఉన్న ఆమె తండ్రి. ఆయన మా పెళ్ళికి ససేమిరా అన్నాడు. కులం విషయంలోనే కాక, హోదా, ఆస్థిలో కూడా వారికి సరితూగనని నన్ను ఆయన తృణీకరించడంలో ఆశ్చర్యం ఏముంది? వందన కూడా తక్కువ తినలేదు. మొండితనంతో తండ్రికి తగ్గకూతుర్ననిపించుకుంది. తమ కులంలో హోదాకు తగ్గ సంబంధాలు చేసుకున్న కొందరి కాపురాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో సోదాహరణంగా వేలెత్తి చూపించింది. ఈ రోజుల్లో కూడా కులంపట్టుకుని వేలాడడమేమిటని నిలదీసింది. నా గుణగణాలను వర్ణించి, నాలో లోపం చూపమని సవాల్ చేసింది. ఎంతైనా తండ్రిగదా! వందన ఆత్మహత్య చేసుకుంటాననడం వట్టి బెదిరింపు కాదనే నిర్ధారణకు వచ్చాడు. కూతురు ఆత్యహత్య ద్వారా వచ్చే అపఖ్యాతి మూటకట్టుకునే బదులు, కూతురు అభీష్టంనెరవేర్చి నిమ్నకులస్తుడితో ఆమె పెళ్ళి జరిపించి, అభ్యుదయవాదిగా సంఘంలో పరపతి పెంచుకోవడమే మేలని భావించాడు. అయితే ఒక మెలిక పెట్టాడు. పెళ్ళి తర్వాత మా ఇంటి వారితో గాని, ఊరివారితో గాని ఏ సంబంధాలు పెట్టుకోకూడదని ఆంక్ష విధించాడు. పెళ్ళికి కూడా మా అమ్మా, నాన్న, చెల్లెల్ని తప్ప వేరే ఎవర్ని పిలవొద్దని షరతు పెట్టాడు. వందన ప్రేమలో అప్పటికే తలమునకలైన నేను తలొగ్గకతప్పిందికాదు. పెళ్ళి తర్వాత మా మామగారి పరపతితో మంచి పోస్టింగులు వచ్చాయి. జీవితం పూలబాటనపడింది. నా ముళ్ళ మూలాలు మరుగునపడ్డాయి. పై స్థాయి వారితో పని చేయడంవల్ల, వాళ్ళ అలవాట్లు వొంటబట్టాయి. సంఘంలో పరపతి పెరిగింది. సహజంగా డాబు, దర్పం అలవడ్డాయి. బీదవాళ్ళంటే చులకన భావం ఏర్పడింది అదెంత పతాకస్థాయికి చేరుకుందంటే మన ఊరివాళ్ళను కూడా ఈసడించుకునే స్థితికి చేరుకున్నాను. వారి అండతో, వారి శుభాకాంక్షలతో ఉచ్ఛ స్థితికి చేరుకున్న నేను, పై కెక్కడానికి తోడ్పడ్డ నిచ్చెననే తోసేసాను. మా అయ్య మరణం నాకళ్ళు తెరిపించింది. దానికి మీ అందరికి కృతజ్ఞతలు చెప్పాలి నేను."

"అంతంత పెద్దమాటలెందుకుగాని, మన వాళ్ళకు కూడా నీలాగే పైకి రావడానికి చేయూతనివ్వు."

"తప్పకుండా భీమా! మా అయ్య పన్నెండు రోజుల కర్మ అయింతర్వాత దాని గురించి చర్చిద్దాం. మా జడ్జిమామ పోయిన సంవత్సరమే చనిపోయారు. నామూలాల్ని చేరుకోవడానికిక ఏ అవరోధం లేదు. అవునూ, నీ సంగతేంటి? ఎస్.ఎస్.సి. తర్వాత చదువు మానేసావుగదా? ఈ టీచరుద్యోగం ఎలా సంపాదించావ్?

"మీకంటే మా ఆర్థిక పరిస్థితి అప్పుడు కాస్త మెరుగ్గా ఉన్నా, నన్ను పై చదువులకు పంపే సాహసం చేయలేదు మా అయ్య. ఉన్న ఊళ్ళోనే ఏదో బతుకుదోవ చూసుకోమని, నా మానానికి నన్ను వదిలేశాడు. ఓ సంవత్సరం రైతు కూలీగా చేశాను. ఏ గమ్యంలేని ఆ జీవితంతో విసుగెత్తింది. మా మామయ్య ద్వారా మన మండల కేంద్రంలో ఓ ఫాబ్రికేషన్ వర్క్‌షాప్‌లో చేరాను. ఇంకా పై చదువులు చదవాలనే నా ఆరాటానికి ఒక ఊతం దొరికింది. ఉద్యోగం చేస్తూ ప్రైవేటుగా డిగ్రీ చేశాను. రిజర్వేషన్ పుణ్యమా అని అదృషవశాత్తు బి.ఇడి. చేయకపోయినా టీచరుద్యోగం వచ్చింది. రెండేళ్ళ సర్వీసు కాగానే పెళ్ళి చేసుకున్నాను. అదే సంవత్సరం ప్రభుత్వమే జీతం ఇచ్చి బి.ఇడి. చేసే అవకాశాన్ని కల్పించింది. అలా రెండేళ్ళు హైదరాబాద్‌లో ఉండి బి.ఇడి. పూర్తి చేశాను. ఇప్పుడు ప్రైవేటుగా ఎం.కాం. చేస్తున్నాను. గ్రూపు టూ పోటీ పరీక్షలకు కూడా ప్రిపేరవుతున్నాను. బ్యాంకులోను తీసుకుని పోయిన సంవత్సరమే చిన్న ఇల్లు కట్టుకున్నాను." భీమయ్య క్లుప్తంగా తన జీవితరేఖాచిత్రాన్ని కుమార్ కళ్ళ ముందుంచాడు.

"మీ ఇల్లు చూశాను. ముచ్చట గొల్పింది. నీ బతుకు పోరాటం వింటుంటే నేనెంత అదృష్టవంతున్నో తెలుస్తుంది. మా అయ్య తనెంత కష్టపడ్డా నన్ను మాత్రం పువ్వులా చూసుకున్నాడు. దొడ్డుబలిసి కులం యాది మరచినట్టు, మా వారికి నేనిచ్చిన ప్రతిఫలం తలచుకుంటుంటే నా మీద నాకే అసహ్యం కలుగుతోంది. నా ప్రవర్తనతో మా అయ్యను పొట్టన పెట్టుకున్నాను. నా పాపానికి నిష్కృతి లేదు. వాపోయాడు కుమార్. "అలా బాధపడకు రాజా అయిందేదో అయిపోయింది. నేనింతకుముందు అన్నట్టు మన వారిని పైకి తెచ్చే నిర్మాణాత్మకమైన కార్యక్రమమేదైనా చేపట్టు. మీ అయ్య ఆత్మశాంతిస్తుంది. చాలా పొద్దైంది. ఇక ఇళ్ళకు వెళదమా?"

దినమంతా పొలాల్లో, చేన్లలో మేసిన పశువులు ఊళ్ళోకి వచ్చే వేళ, గోధూళిని ఆస్వాదిస్తూ, ఒక గమ్యం నిర్దేశించుకున్న ఇద్దరు మిత్రులూ ఇంటిదారి పట్టారు. గరుడయ్య పెద్దకర్మ కూడా చాలా ఘనంగా జరిగింది. పి.కుమార్ మునుపటి ప్రవర్తన వలన దూరమైన బంధువులు, అతనిలోని మార్పు గమనించి తిరిగి ఆ ఇంటి గడప

తొక్కారు. ఇల్లంతా బంధువులతో సందడిగా మారింది. గరుడయ్య మంచి తనాన్ని త్యాగాన్ని, అందరూ పొగిడేవారే! అతని మరణం వల్లనైతేనేమి పోతరాజులో మార్పు వచ్చినందుకు అందరూ సంతోషించారు.

కుమార్‌కైతే కోల్పోయిన పెన్నిధిదొరికి నట్లయింది. వందన కూడా భేషజం, బిడియం వీడి అందరితో కలిసిపోయింది. వారి పిల్లల ఆనందానికైతే హద్దేలేదు. పట్నవాసంలోని ఇరుకు జీవితంకంటే పల్లెలోని విశాల ఆవరణ వారిలో నిజమైన బాల్యాన్ని చిగురింపజేసింది. మూడు వారాల దీపావళి సెలవులు కలిసిరావడంతో వారి చదువుకు పెద్ద ఆటంకం కలగలేదు. హాయిగా తమ ఈడు పిల్లలతో కేరింతలు కొడుతూ ఆటల్లో పడ్డారు వారు. నగర జీవితంలోని కృత్రిమత్వానికి దూరంగా, ప్రకృతిఒడిలో, నిష్కల్మశ మనుషుల మధ్య ఇరవై రోజులు ఎలాగడిచాయో, కుమార్ కుటుంబానికి తెలీనే లేదు. ఆనవాయితీ ప్రకారం దగ్గరి చుట్టాలింటికి నిద్రకు కూడా వెళ్ళి వచ్చారు వారు.

ఓ రోజు కులపెద్ద ఆశన్న, కుమార్‌ను పిలిపించాడు. కులకట్టడి ప్రకారం ప్రాయశ్చిత్తం చేసుకోవాలని చెప్పాడు. పెద్దలు ఎలా చెబితే అలా వింటానని మాట ఇచ్చాడు కుమార్.

"సరే అచ్చే (రానున్న) అయితారం (ఆదివారం) కూసుందం అన్నాడు ఆశన్న. ఆ మర్నాడు భీమన్నను తీసుకొని జిల్లా కేంద్రానికి వెళ్ళాడు కుమార్. అక్కడ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీ జ్యోతీరావుకు తన పరిచయం ఇచ్చి తను వచ్చిన పని చెప్పాడు. వెనకబడ్డ జాతుల వారికి ప్రభుత్వం ఇచ్చే రాయితీలు, కల్పించే సౌకర్యాల గురించి తెలుసుకున్నాడు. వాటికి సంబంధించిన కరపత్రాలు, పుస్తకాలు సేకరించాడు. కుమార్‌నూ, భీమయ్యను కలిసి, తనూ దళితుడైన జ్యోతీరావు పరమానంద భరితుడయ్యాడు. యుగయుగాల నుండి అణగదొక్కబడిన జాతుల ఆర్థిక, సామాజిక ప్రగతి కొరకే భారతరత్న స్వ॥ డా॥ అంబేడ్కర్ రిజర్వేషన్లను మన రాజ్యాంగంలో చేర్చారని చెప్పాడు. మొదట పది సంవత్సరాలకే పరిమితమైన రిజర్వేషన్లు, ఆశించిన ఫలితాలు ఇవ్వనందున వాటిని ప్రతి పది సంవత్సరాలకూ పొడిగిస్తున్నారని చెప్పాడు. రిజర్వేషన్లు దళితులను ఆర్థికంగానేగాక వారికి సామాజిక గౌరవం కూర్చదానికి కల్పించబడ్డాయనీ, అయితే స్వాతంత్ర్యం వచ్చి అరవై ఏళ్ళు కావస్తున్నా దళితుల జీవితాల్లో తగినంత అభివృద్ధి జరగలేదని వాపోయాడు.

"దానికి మన రాజకీయ నాయకులే కారణమంటాను. దళితులని ఓటు బ్యాంకుగా తప్ప మనుషులుగా పరిగణించని నాయకులు తమ స్వార్థంకై వారిని ఉపయోగించు

కుంటున్నారే గాని, చిత్తశుద్ధితో వారిని సమగ్ర అభివృద్ధి కొరకు కృషి చేయడం లేదు. దళితులు పై చదువులు చదివితే తెలివి మీరి పోతారని, గ్రామాల్లో తమ తొత్తుల ద్వారా దళితులు తమ పిల్లలను పై చదువులకు పంపకుండా, అడ్డుపడు తున్నారు. అంతేకాక వాళ్ళలో వాళ్ళకు మనస్పర్థలు కల్పించి వారిని ఒకేత్రాటిపై నిలుచోకుండా చేస్తున్నారు". భీమయ్యలో ఉక్రోషం పెల్లుబికింది.

"మీరు చెప్పింది కొంతవరకే నిజం. కుమార్‌లాగా దళితుల్లోంచిపైకి వచ్చిన చాలా మంది తమ మూలాల్ని మరచి, తామూ ఉన్నత కులస్తులలాగా నడుచుకుంటున్నారు. తమ వారిని కూడా పైకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయడంలేదు. అలా చేస్తే వారు తమ కంటే పై స్థాయి కెదుగతారని అసూయ ఒక ప్రక్క, ఎక్కడ తమ ఆధిపత్యం పోతుందో అనే అభద్రతా భావం ఇంకో ప్రక్క పనిచేయడం, దీని వెనుక కారణమను కుంటాను. దళితుల్లో కాస్త పైమెట్టుకు చేరిన వారే రిజర్వేషన్ల లాభాలను పూర్తిగా వినియోగించుకుంటున్నారు. అట్టడుగున ఉన్నవారు ఒకింత క్రిందికే జారుతున్నారు. యస్.సి. జడ్జుల పిల్లలు జడ్జీలౌతున్నారు, యస్.టి., ఐ.ఏ.ఎస్.ల పిల్లలు ఐ.ఏ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఆర్.ఎస్. పరీక్షల్లో నెగ్గుకొస్తున్నారు. బీద దళితులు మాత్రం చిన్న చితక పనులు చేస్తూ అవకాశం కల్పించుకుని అరబ్ దేశాలకు వలసపోతున్నారు. తగిన శిక్షణ లేక సరైన మార్గదర్శనం లేక తగు అర్హత సంపాదించుకో లేక పోయిన పాపానికి, దళితులకై ఆరక్షించిన ఉద్యోగాలు పరుల పరమైపోతున్నాయి. దీనికి ఉచ్ఛ తరగతి ఉద్యోగుల రాజకీయాలు కూడా కారణమే. రిజర్వేషన్ల ఫలాలు, నిమ్నకులస్థు లందరు ఎప్పుడు పూర్తిగా వినియోగించుకుంటారో అప్పుడే వారి ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. అది వారి సామాజిక ఉన్నతికి, గౌరవానికి దారితీస్తుంది." జ్యోతిరావు వివరించాడు.

"తప్పంతా ఉచ్ఛకులస్థులపై నెట్టడం సబబు కాదనుకుంటాను. మన వాళ్ళలో తిని, తాగి, తందనాలాడే స్వభావం కూడా వారి హీనస్థితికి ఓ కారణం. డబ్బు కక్కుర్తితో, ఉన్న వాళ్ళ కొమ్ముకాసి, మన వారికే ఎసరుపెట్టే వారెందరు లేరు? ప్రభుత్వం ఇచ్చిన రాయితీలను కల్పించిన సౌకర్యాలను దుర్వినియోగం చేసి, మళ్ళీ యథాస్థితికి చేరుకున్న వారెందరినో నేను కళ్ళారా చూశాను. అందుకే నాకు అలాంటి వారి మీద ఏహ్యభావం ఏర్పడింది." కుమార్ తన కోణం స్పష్టం చేశాడు.

"మీరన్నది కూడా నిజమే, కాని మనవారిని సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత మనమీదే ఉంది. ఏ ప్రవక్తో, సామాజిక కార్యకర్తో, దీనికి పూనుకోవాలనుకోవడం మనలాంటి వారికి తగదు. మనం పూనుకుంటే గాని మన కులం వాళ్ళలో పరివర్తన

రాదు. ఆ పరివర్తన వస్తేగాని దళితుల అభివృద్ధి సాధ్యంకాదు. ఈ విషయంలో మీలాంటి వారు ముందుకువస్తే నా నుండి పూర్తి సహకారం ఉంటుంది. కుమార్‌గారు ముంబాయికి తిరిగి వెళ్ళింతర్వాత కూడా మీ ఊరి వారికి సలహాలివ్వడానికి, సహాయం చేయడానికి నేను సిద్ధం. అవసరమైతే నేను స్వయంగా మీ ఊరికి వచ్చి మార్గ దర్శనం చేస్తాను." జ్యోతీరావు అభయమిచ్చాడు.

"అంతకంటేనా! మీ లాంటి అధికారులుంటే మనం సాధించలేనిదేదీ లేదు సార్!" మనస్ఫూర్తిగా అన్నాడు కుమార్. భీమయ్య కూడా గాఢ కరచాలనం చేసి సెలవు తీసుకున్నాడు.

ఆ మరుసటి ఆదివారం...

ఆ దళితవాడలోని రావిచెట్టు. దాని కింద రచ్చబండ. వాడవాడంతా తరలివచ్చి నట్టుంది. కులపెద్దలు, యువకులు, స్త్రీలు, పిల్లలు అంతా అక్కడికి చేరారు. ఓ వైపు పోత కుమార్ కుటుంబం కూర్చున్నారు. ఆశన్న సమావేశం ప్రారంభించాడు.

"కులమోల్లందరికి శెనార్తి, మనగరుడయ్య కాలం జేసి దగ్గర, దగ్గర నెల కావస్తుంది. ఆ పెద్దమనిసి మనకొరకు, మన కులపోల్ల కొరకు ఎంతో పని జేశిండు. ఓల్లకు ఏ పని వడ్డా ముందటికచ్చి సాయం జేశిండు. ముప్పయేండ్ల కిందనే, పిల్లలుగాకుంట ఆప్రిషన్ సేయించున్నడు. గట్ల సదునేర్వని గరుడయ్య మనందరి కంటే ఎంతో లోతుగ సోచాయించి, తన కుటుంబంను మంచిగా సాదిండు. ఆ పిల్లలు కూడ మన ఊరుకు పేరు తెచ్చింద్రు. గసోంటి గరుడయ్య సచ్చినందుకు మనందరికి శానబాధ అనిపిస్తుంది. ఆయినకు స్వర్గంల శాంతి దొరుకాలని మనందరం ఒక్క మినిట్ నిల్సుండి ప్రార్థిద్దం."

అందరు నుంచుని ఓ నిముషం మౌనం పాటించారు. ఆశన్న మాటలకు మైసమ్మ, కుమార్ చలించారు.

వారి కళ్ల నిండా నీళ్ళు!

సభ మళ్లీ ప్రారంభమైంది.

"మన పోతరాజు, గరుడయ్య కొడుకు మీకందరికి ఎర్కనే. తను ఢిల్లీ గౌర్మెంట్ల పెద్ద ఆఫీసరు. మన ఆల్ టోటల్ జిల్లాలనే మన ఊరికిపేరు దెచ్చిండు. అదంత నిజమే గని, తను పెద్ద కొలువులసేరినంక మనల్ని, మన ఊరిని మర్సిపోయిండు. అంతేగాదు, ఆయన తల్లిదండ్రులను గూడా కానకుంట అయిండు, ఆయన తన లగ్గం గాని, పిల్లల బార్సగాని, మన ఊర్లె చేయలేదు. మనందరిని పిల్సి ఒక్కపూట

భోజనం పెట్టలేదు. మనం ఆయన సదుకొరకు ఎంత పాటుపడ్డమో, మనకెరుక, పైన భగవంతుని కెరుక. మన కులంను కాదని ఎంతదూరం పోతడో సూద్దం అని ఊర్కున్నం. టైమ్‌రాకపోతదా, మనతోని ఆయనకు పని పడకపోతదా అని సూత్తున్నం. మన టైం అచ్చింది. గరుడయ్య సచ్చినంక కులకట్టడి జేసి కొంత సేపు బిర్ర దీసుకున్నం. పోతరాజు తన తప్పు తెలుసుకున్నడు. మన కులమోల్లకు శరనచ్చిండు. మనం ఏ సిచ్చ ఏసినా కట్టువడి ఉంటనని మాటిచ్చిండు. అయితేనే మనం గరుడయ్య సావుజేశినం. దినాలు గూడ బాగనె జర్గినయి. పోతరాజు డ్యూటీ మీద ఎక్కే టైము దగ్గరికచ్చింది. ఆయనకు ఏ శిచ్చ ఎయ్యాల్నో ఆలోసించుండ్రి ఆశన్న ముగించాడు.

"కొత్తగ జెప్పేదేమున్నది? గిసోంటి తప్పులకు మన కుల కట్టడి ఉండనే ఉన్నది. యాటతోని భోజనం జేసి మనందరికి తాగినంత కల్లు పోపియ్యాల" ఓ పెద్దమనిషి అన్నాడు. "అది మనసోంటి గరీబోల్లకు శిచ్చ, పోతరాజు పెద్ద ఆఫీసరు, బాగ పైసున్నోడు. అత్తగారి అత్తిగూడా ఆయనకే అచ్చే. తిండి, కల్లుగాక గొన్ని రూపాయలు దండుగు (జరిమానా) కొట్టాల" ఇంకో ఆయన అన్నాడు.

"మనం తిని, తాగంగనే, దండుగు గొట్టంగనే అయిపాయెనా? దాంతోని మనోల్లకు ఏం పాయిదా? అది గూడా ఆలోసించాలమనం", ఒక కాలేజీ విద్యార్థి అన్నాడు.

"ఔ నివద్దే. పోతరాజు మన కులంల పెద్ద కొలువు జేత్తున్న మనిషి. ఆయనకు మనం జెప్పుడేంది? ఆయననే సెప్పు మందం. మన ఊరోల్లం ఆయనకు జేసిన ఉపకారంకు ఆయన మనలను కాతరు సేయనందుకు, ఏం జేసి మనలను శాంతం జేస్తడో సెప్పునియండ్రి." ఒక నడివయస్కుడన్నాడు.

"గిది మామూలు లెక్క ఎప్పుడయ్యే పంచాది గాదు. ఒక కొత్త తప్పిదం. దానికి శిచ్చ కూడా కొత్తగనే ఉండాల. అందుకని పోతరాజే ఈ విషయంల తన ఆలోసన చెప్పాల." ఆశన్న పోతరాజు వైపు చూశాడు. పోతరాజు అలియాస్ పి.కుమార్ లేచి అందరికి చేతులెత్తి అభివాదం చేశాడు., "మన ఊరిపెద్దలకు, అమ్మలకు, అక్కలకు, అన్నలకు నమస్కారం, మనిషి ఎంత ఎత్తుకు ఎదిగినా తన పునాదిని మరువరాదు. ఎవ్వరితోనైనా ఏం పని ? అని కులమోల్లను కించపరచరాదు. పైస పారేత్తే పచ్చీస్ పనులైతయని అనుకుంటే తప్పే. కొన్ని పనులు ఎంత డబ్బు ఖర్చు చేసినా కావు. ఒకవేళ అయినా వాటిలో జీవముండదు. ఇది నేను స్వయంగా అనుభవించి తెల్సుకున్న నిజం. నేనుగిన తల్సుకుంటే పోలీసుల సాయంతో మానాయిన్న సావు చేయిస్తుంటి, లేకపోతే యాంబులెన్స్‌ల శవాన్ని సిటీకి తీసుకపోయి అక్కడ అంత్యక్రియలు చేయవచ్చు. అంతజేస్తే నాకుగాని, మా అమ్మకు గాని ఎంత మనస్తాపం? నిజంగా

నా తప్పును తెలుసుకున్నాను. అందుకని మనస్ఫూర్తిగా కులపెద్దలను ఆశ్రయించాను. నా తప్పుకు ప్రాయశ్చిత్తం చేసుకుంటానని మాటిచ్చాను.

"గదే, నీకు నువ్వు ఏం సిచ్చ ఏసుకుంటవో జల్ది జెప్పు. ఈడ భోజనంకు యాల్లయితున్నది" "రాజన్నా! గట్ల నద్మల మాట్లాడితె ఎట్లనే? ఇంకా ఆలిసెంగాదా? ఒక్కనాడు జర తిననికి ఆలిసెం అయితే సత్తమా? పోతరాజూ నువ్వు కానియ్యవయ్యా" ఆశన్న కల్పించుకున్నాడు. పోతరాజు ఏం చెబుతాడో అని అందరిలో ఉత్కంఠ. కుమార్ కొనసాగించాడు.

"ఇంతకు ముందు ఎవరో అన్నట్టు, తిని, తాగితే, అది అంతటితోనే సరి. దాంతో ఖర్చు బాగానే అయితది కాని అంతగా లాభం చేకూరదు. ఏదైనా అందరికి పనికి వచ్చే పని చేయాలి అని చాలా ఆలోచించాను. ఈ విషయంలో పెద్దనాయిన ఆశన్న మాటలు నాకు జ్ఞప్తికివచ్చాయి. నేనైతే ఏదో పైకి వచ్చాను. కాని, 'మన ఊరు పిల్లలను నాలాగా పైకి తీసుకురావడానికి నేనేం చేశాను? అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను. పెద్దనాన్న మాటలే నాకు దారి చూపాయి. మన ఊరి వారికే కాదు. చుట్టుప్రక్కల ఊర్లల్లోని వెనకబడ్డ కులాల యువకులందరికి ఉపయోగపడేటట్లుగా ఏదైనా చేయాలని నిశ్చయించుకున్నాను. మన ఊర్లో ఒక స్వచ్ఛంద సేవా సంస్థను ప్రారంభిస్తున్నాము. "వ్యవసాయ ఉపాధి మార్గదర్శక కేంద్రం" ద్వారా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తాం. వివిధ ప్రభుత్వ ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగాల సమాచారం, వాటికి సంబంధించిన పరీక్షలు రాయడానికి మార్గదర్శక క్లాసులు నిర్వహించాలనుకుంటున్నాము. ఇంటర్వ్యూ ఎదుర్కోవడానికి బోధనా తరగతులు మొదలగు కార్యక్రమాలన్నీ ఈ కేంద్రం ద్వారా చేపట్టుతాం. ఈ విషయంలో మన జిల్లా సమాజ కళ్యాణ అధికారి శ్రీ జ్యోతిరావును ఈ మధ్యే కలిశాము. మనకు అన్ని విధాల సహకరిస్తానని మాట ఇచ్చాడు. చదువుల్లో, ఉద్యోగాల్లో మనకు ప్రభుత్వం కల్పించిన వసతులకు సంబంధించిన సమాచారం సేకరించాము. మన ఊర్లో "వ్యవసాయ ఉపాధి మార్గదర్శన కేంద్రం" ఆయన చేతుల మీదుగా ప్రారంభింపజేయాలని ఉంది. ఈ కేంద్రం నిర్వహణ కొరకు అయ్యే ఖర్చు నేను చూసుకుంటాను. దీనికి సమన్వయకర్తగా ఉండడానికి భీమయ్యసార్ ఒప్పుకున్నాడు. ఈ సంస్థ కార్యకలాపాలను సక్రమంగా నిర్వహించడానికి తగిన సిబ్బందిని, కావలసిన వనరులను నేను సమకూరుస్తాను. ఈ కేంద్ర నిర్వహనను దగ్గరగా పర్యవేక్షించడానికి నేను హైదరాబాద్ బదిలీ చేయించుకుంటాను."

ఒకసారిగా చప్పట్లు. అందరిలో ఉత్సాహం. పోతరాజు కొనసాగించాడు.

"ఇదీ టూకీగా మన వాళ్ళకు నేను చేయాలనుకున్న పని. నా తప్పుకు, నాకు తోచిన ప్రాయశ్చిత్తం. ఇదే కాకుండా మీరేం చేయమన్నా చేస్తాను. మీ అందరికి మరోసారి ధన్యవాదాలు. నమస్కారం."

ఆశన్నతో సహా అందరి ముఖాల్లో వెలుగు, చెప్పరాని సంతోషం! పోత కుమార్ తన స్థాయికి తగ్గట్టుగా పరిహారం చెల్లిస్తున్నాడన్న తృప్తి అందరూ ఏక కంఠంతో కుమార్ ప్రతిపాదన ఆమోదించారు.

రెండు రోజుల తర్వాత...

దళిత వాడలో పండగ వాతావరణం.

"జ్యోతిబా ఫులే వ్యవసాయ, ఉపాధి మార్గదర్శన కేంద్రం" ప్రారంభోత్సవం.

శ్రీ జ్యోతీరావు, జ్యోతి వెలిగించాడు. అది ఆ వాడలోని ప్రజల్లో, ప్రజ్వలించింది.

ఆ ఊరు ఓ నూతన అధ్యాయానికి నాంది పలికింది.